క్లుప్తంగా

ముగిసిన క్రికెట్ పోటీలు



తాడిపత్రి జట్టుకు బహుమతి అందిస్తున్న నిర్వాహకులు

కొలిమిగుండ్ల: వేసవి సెలవులను పురస్కరించుకుని కల్వటాలలో నిర్వహించిన క్రికెట్ పోటీలు గురువారంతో ముగిశాయి. వివిధ ప్రాంతాల నుంచి 30 జట్లు పాల్గొనగా పోటీలు హోరాహోరీగా సాగాయి. అనంతపురం జిల్లా తాడిపత్రికి చెందిన సునీల్ టీం విజేతగా నిలిచింది. కల్వటాల టీం రెండో స్థానం, తాడిపత్రికి చెందిన బాషా టీం మూడో స్థానంలో నిలిచింది. గెలుపొందిన జట్లకు వరుసగా రూ.20వేలు, రూ.10వేలు, రూ.5వేల చొప్పున నగదు బహుమతులు అందజేశారు.

నాటుసారా స్వాధీనం

అవుకు: మండల పరిధిలోని రామాపురం గ్రామంలో 60 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రాజారెడ్డి గురువారం తెలిపారు. గ్రామంలోని చీమలకుట్ట సమీపంలో సారా అమ్ముతుండగా అదే గ్రామానికి చెందిన కావేరి అనే మహిళను అదుపులోకి తీసుకుని, రిమాండ్‌కు తరలించామన్నారు. నాటుసారా సరఫరా చేసిన కొండమనాయునిపల్లెకు చెందిన కంబగిరి పరారీలో ఉన్నాడని ఎస్ఐ తెలిపారు.

వృద్ధురాలికి అంత్యక్రియలు



అంత్యక్రియలు నిర్వహిస్తున్న ఆ నలుగురు సభ్యులు

బేతంచెర్ల: పట్టణంలోని మిస్పా వృద్ధాశ్రమంలో వృద్ధురాలు జోజమ్మ(90) అనారోగ్యంతో మృతి చెందింది. తాను మరణించిన తరువాత క్రిస్టియన్ సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు నిర్వహించాలని ఆ నలుగురు స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు వన్నూర్ బాషాను కోరింది. ఆమె విన్నపం మేరకు పోలీసులకు విషయం తెలిపి క్రిస్టియన్ పద్ధతిలో వృద్ధురాలి అంత్యక్రియలు నిర్వహించారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు



స్వామివారి విగ్రహానికి పూజలు చేస్తున్న భక్తులు

సంజామల: పేరుసోములలోని కోటపాటు మెట్టలో పంచవటి అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలను పురస్కరించుకుని గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రాతఃకాలపూజ, జపపారాయణం, మహాన్యాస పూర్వపు రుద్రాభిషేకం, మంగళహారతి, హోమ పూజలు చేశారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు. శుక్రవారం అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ ఉంటుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

బాలాంజనేయస్వామి సేవలో కాటసాని



స్వామివారిని దర్శించుకుంటున్న కాటసాని రామిరెడ్డి దంపతులు

బనగానపల్లె: హనుమాన్ జయంతి సందర్భంగా రవ్వలకొండపై వెలసిన బాలాంజనేయ స్వామిని మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జయమ్మ దంపతులు గురువారం దర్శించుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులకు రామిరెడ్డి దంపతులు అన్నదానం ఏర్పాటు చేసి స్వయంగా వడ్డించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎం.దస్తగిరిరెడ్డి, సభ్యుడు వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విజిలెన్స్ అధికారుల తనిఖీ

కోడుమూరు రూరల్: మండలంలోని వెంకటగిరి గ్రామంలో కొందరు వ్యక్తులు నకిలీ పత్తి విత్తనాలు అమ్ముతున్నారన్న సమాచారంతో గురువారం విజిలెన్స్ అధికారులు ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. గ్రామంలోని ముగ్గురు అనుమానిత వ్యక్తుల ఇళ్లలో విజిలెన్స్ అధికారులు విశ్వనాథ్, భూపతి మండల వ్యవసాయాధికారి రవి ప్రకాష్‌తో కలిసి తనిఖీలు నిర్వహించి నకిలీ విత్తనాల అమ్మకాలపై ఆరా తీశారు. అయితే తనిఖీల్లో ఎలాంటి విత్తనాలు పట్టుబడలేదని అధికారులు తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా అనుమతి లేకుండా లూజు పత్తి విత్తనాలు అమ్ముతుంటే అలాంటి వారి సమాచారాన్ని తమకిస్తే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. వ్యవసాయ శాఖ అనుమతి ఉన్న దుకాణాల్లో మాత్రమే విత్తనాలను కొనుగోలు చేయాలని, కొనుగోలు సమయంలో దుకాణదారుడి నుంచి తప్పనిసరిగా రసీదు పొందాలని ఏఓ సూచించారు.



దోన్: గుమ్మకొండలో..



దోన్: ఇందిరానగర్‌లో..



దోన్: తారకరామనగర్‌లో..



సంజామలలో..



దోన్: కొండమీది వీరాంజనేయస్వామి



కొలిమిగుండ్ల: మీర్జాపురంలో పూజలు నిర్వహిస్తున్న జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

జై భజరంగబలి

- ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు
- ఆలయాల్లో విశేష పూజలు
- భక్తిశ్రద్ధలతో శోభాయాత్ర

కొలిమిగుండ్ల: హిందూ పురాణాల ప్రకారం శ్రీరాముని భక్తుడు హనుమంతుడు. ఆంజనేయుడిని ఆరాధించిన వారికి సకల పాపాలు తొలగిపోతాయని భక్తుల ప్రగాఢ నమ్మకం. గురువారం హనుమాన్ జయంతి వేడుకలను డోన్, బనగానపల్లె నియోజకవర్గాల్లో ఘనంగా జరుపుకున్నారు. ఆయా ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. కొలిమిగుండ్ల మండలం మీర్జాపురం పొలిమేర ఆంజనేయస్వామి ఆలయంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేడుకల్లో జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి పాల్గొన్నారు. స్వామికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఆర్ఎస్ఎస్ నాయకులు శ్రీనివాసులు, చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో కొలిమిగుండ్లలోని అయ్యప్పస్వామి ఆలయం నుంచి ఆర్టీసీ బస్టాండ్, పోలీస్ స్టేషన్ మీదుగా మీర్జాపురం వరకు భక్తులు బైక్‌ల్లో జైశ్రీరాం నినాదాలు చేస్తూ శోభాయాత్ర నిర్వహించారు. కోర్నపల్లె సమీపంలోని గుండం ఆంజనేయస్వామి ఆలయంలో విశేష పూజలు జరిగాయి. భక్తులకు తీర్థప్రసాదాలు, పానకం పంపిణీ చేశారు. భజన బృందాలు భజన గీతాలు ఆలపించారు.



అవుకు: నిచ్చెనమెట్లలో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

బేతంచెర్ల: పట్టణంలోని చెన్నకేశవస్వామి ఆలయంలో వెలసిన ఆంజనేయస్వామి, గాడుబావి వీరాంజనేయస్వామి, బుగ్గానిపల్లె రహదారిలోని పలకచింతమాను అంజనేయస్వామి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. గాడుబావి ఆంజనేయస్వామి ఆలయంలో 5 రూపాయాల నాణేలతో తులభారం నిర్వహించారు. గౌరిపేట ఆంజనేయస్వామి ఆలయంలో భజన కృష్ణయ్య ఆధ్వర్యంలో హనుమాన్‌చాలీసా పారాయణం చేశారు. గోరుమానుకొండ, గోర్లగుట్ట, సీతారామాపురం, గూటుపల్లె, సిమెంట్‌నగర్ గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అన్నదానం ఏర్పాటు చేశారు. మన ఊరు-మన గుడి సభ్యులు, హిందూ సంఘాల ఆధ్వర్యంలో గౌరిపేట ఆంజనేయస్వామి ఆలయం నుంచి వీర హనుమాన్ శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక అలంకరించిన రథంపై స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని కొలువుంచి జైశ్రీరామ్ నామస్మరణలు, కోలాటాల నడుమ ఊరేగింపు సాగింది.



శోభాయాత్రకు తరలివచ్చిన భక్తులు

సంజామల: ఆకుమల్ల ఆంజనేయస్వామి ఆలయంలో స్వామివారికి ఆకుపూజ, భజనలు నిర్వహించారు. పూజారి సత్యమయ్య ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

డోన్ టౌన్: పట్టణంలోని ఆంజనేయస్వామి దేవాలయాల్లో ఉదయం నుంచి అభిషేకాలు, సింధూర అర్చన, ఆకుపూజ, హనుమాన్‌చాలీసా తదితర కార్యక్రమాలు చేపట్టారు. ఇందిరానగర్ అభయాంజనేయస్వామి, ప్రభుత్వ ఐటీఐ వద్ద ఉన్న ఆంజనేయ స్వామి, పాతపేట, తారకరామనగర్, కొండమీది వీరాంజనేయస్వామి, వెంకటాపురం, గుమ్మకొండ, బంగారుపాలెం, పాతమల్ల ఆంజనేయస్వామి ఆలయాల్లో విశేష పూజలు జరిగాయి. అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఆయా ఆలయాలు భక్తులకు కిటకిటలాడాయి. సాయంత్రం స్వామివారి శోభాయాత్ర కనులపండువగా సాగింది.



బేతంచెర్ల: హనుమాన్‌చాలీసా పారాయణం చేస్తున్న భక్తులు

అవుకు: మండలంలో హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. నిచ్చెనమెట్ల గ్రామంలోని వీరాంజనేయస్వామి ఆలయంలో స్వామివారికి విశేషంగా అలంకరించి దూపదీప, నైవేద్యాలు సమర్పించారు. ఆకుపూజ నిర్వహించారు. కోలాటాల నడుమ పురవీధుల్లో స్వామివారికి పల్లకీ సేవ చేశారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంజీవరాయుడు తోట, రాజావీధి, శివవరం గ్రామంలోని ఆలయాల్లో భక్తులు స్వామి వార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

బనగానపల్లె రూరల్: మండలంలోని పలుకూరు గ్రామంలో యనకండ్ల ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఆంజనేయస్వామి ఉత్సవ విగ్రహంతో శోభాయాత్ర నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



అవుకు :శివవరంలో శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు



బనగానపల్లె: పలుకూరులో శోభయాత్ర నిర్వహిస్తున్న భక్తులు



బేతంచెర్ల: స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు



బేతంచెర్ల:ప్రత్యేకంగా అలంకరించిన రథంపై ఆంజనేయస్వామి శోభాయాత్ర

మన సంప్రదాయాలు ప్రపంచానికే ఆదర్శం

బనగానపల్లె: మన దేశ సంప్రదాయాలు ప్రపంచానికి ఆదర్శమని పలుకూరు జేకేఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బ్రహ్మనంద ఆచారి అన్నారు. మండలంలోని పలుకూరు గ్రామంలో గురువారం బేతంచర్ల పట్టణానికి చెందిన కోలాట గురువు మధును దుశ్శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా బ్రహ్మనంద ఆచారి మాట్లాడుతూ.. సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కళలను ప్రోత్సాహించాలన్నారు. కార్యక్రమంలో చాకలి పెద్దయ్య, సుధాకర్‌గౌడ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



కోలాట గురువు మధును సన్మానిస్తున్న సంఘం సభ్యులు

రహదారిని కమ్మేసిన కంపచెట్లు

బేతంచెర్ల: మండల కేంద్రమైన బేతంచెర్ల పట్టణం నుంచి వెల్దుర్తి మార్గంలోని కొలుములపల్లె, వెంకటగిరి, ఎం.పేండేకల్లు గ్రామాల మధ్య రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లు కమ్మేశాయి. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కంపచెట్లు పెరగడం వల్ల రోడ్డు సరిగ్గా కనిపించక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి రహదారికి ఇరువైపులా పెరిగిన కంపచెట్లను తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.



బేతంచెర్ల-వెల్దుర్తి మార్గంలో రోడ్డుపైకి వచ్చిన కంపచెట్లు

శ్రీశైలంలో స్వచ్ఛసేవ



శ్రీశైలంటెంపుల్: స్వచ్ఛ శ్రీశైలం నిర్వహణలో భాగంగా గురువారం క్షేత్ర పరిధిలో పారిశుద్ధ్య స్వచ్ఛసేవా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముందుగా గంగాధర మండపం నుంచి నందిగుడి వరకు అవగాహన ర్యాలీ ఏర్పాటు చేశారు. ఆలయ ప్రధాన వీధులు, గంగాధర మండపం నుంచి నంది మండపం వరకు, డొనేషన్ కౌంటర్, అన్నదాన విభాగం, గణేష సదన్, ఘంటామఠం, యాంపిథియేటర్, టూరిస్ట్ బస్టాండ్, పాత ఫిల్టర్ బెడ్ ప్రాంగణంలో పారిశుద్ధ్య పనులు చేపట్టారు.

వ్యక్తి దుర్మరణం

గుత్తి రూరల్: వాహనం ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... ప్యాపిలి మండలం రాచర్ల గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు (44) వ్యక్తిగత పనిపై గురువారం గుత్తికి వచ్చాడు. పని ముగించుకున్న అనంతరం ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యాడు. గుత్తి మండలం వన్నేదొడ్డి గ్రామ శివారులో 44వ జాతీయ రహదారిపై ప్రయాణిస్తుండగా వెనుక నుంచి వేగంగా వచ్చిన ఓ వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ వాహనంతో సహ ఉడాయించాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించి, కేసు నమోదు చేశారు.

పచ్చని పంటకు పచ్చిరొట్ట

- వీటితో నేల సారవంతం
- మొక్కలకు అవసరమైన పోషకాలు
- ఫలితంగా అధిక దిగుబడులు



సాగవుతున్న పచ్చిరొట్ట పైరు (ఇన్‌సెట్) కిరణ్ కుమార్

బేతంచెర్ల: రబీసాగు అనంతరం పొలాల్లో పచ్చిరొట్ట పైరులను పెంచడం వల్ల భూసారాన్ని పెంచుకుని తద్వార రసాయన ఎరువులను తగ్గించుకోవచ్చు. భూముల్లో సేంద్రియకర్బణం పెరిగి పంట దిగుబడులు పెంచుకోవచ్చు. అధిక మోతాదులో వేసే రసాయనిక ఎరువులతో భూములు సారం కోల్పోతాయి. పచ్చిరొట్ట పైర్ల సాగుతో పెట్టుబడులు తగ్గడమే కాకుండా పంట దిగుబడులను పెంచుకోవచ్చని వ్యవసాయ అధికారి కిరణ్ కుమార్ చెబుతున్నారు. భూమిని సారవంతం చేసుకోవడానికి వరిపంట వేసే పొలంలో పచ్చిరొట్ట ఎరువులు అయిన జీలుగలు, పిల్లి పెసర, జనుము పంటలను వేసి పూత సమయంలో కలియదున్నడం వల్ల నేల సారవంతమై అధిక దిగుబడులు సాధించడానికి దోహదం చేస్తాయి. పచ్చిరొట్ట పైర్లలో నత్రజని 1.8 నుంచి 3.5 శాతం, భాస్వరం 0.1 నుంచి 3.5 శాతం, పొటాషియం 0.5 నుంచి 2 శాతం వరకు ఉంటాయి. పంట ఎదుగుదల, దిగుబడికి ఈ మూడు పోషకాలు ఉండడం వల్ల రసాయన ఎరువులు పెద్దగా వేయాల్సిన అవసరం ఉండదు. 30 శాతం వరకు రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించవచ్చు.

పచ్చిరొట్టతో లాభాలు

పచ్చిరొట్టతో అనేక లాభాలు ఉన్నాయి. పచ్చిరొట్టను భూముల్లో కలియదున్నడం వల్ల భూసారం పెరుగుతుంది. ఎకరానికి 50 కిలోల వరకు నత్రజని అందుతుంది. భాస్వరం, గంధకం వంటి పోషకాల లభ్యత గణనీయంగా పెరుగుతుంది. భూమి బాగా గుల్ల బారుతుంది. భూమిలో స్థూల సూక్ష్మపోషకాల లభ్యత పెరుగుతుంది. భూమికి తేమను ఎక్కువ రోజులు నిలుపుకునే శక్తి వస్తుంది. పంట నాణ్యత పెరుగుతుంది. పచ్చిరొట్టకు వేరు బుడిపెలు ఉండడం వల్ల నత్రజనిని స్థిరీకరిస్తాయి. సారవంతమైన నేలలను చౌడు భూములుగా మారకుండా నివారిస్తాయి. ఒకవేళ భూముల్లో ఏదైనా లవణాల సంఖ్య ఎక్కువగా ఉంటే వాటిని తగ్గించి సారవంతమైన భూమిగా చేస్తాయి.

పెట్టుబడి వ్యయం తగ్గుతుంది

జనుము, జీలుగ, పిల్లి పెసర తదితర రకాలను సాగు చేసుకోవాలి. వీటిని పూత దశ వరకు పెంచి పంటల సాగుకు ముందు భూమిలో కలియదున్నాలి. పచ్చిరొట్ట పైర్లలో స్థూల పోషకాలు అధికంగా ఉంటాయి. స్థూల పోషకాలతో పాటు సూక్ష్మ పోషకాలు సైతం భూమికి లభిస్తాయి. పంటల ఎదుగుదలకు ఈ మూడు పోషకాలు ఎంతో అవసరం. భూమి లోపల నిక్షిప్తమైన పోషకాలను ఈ పైర్లు వెలికితీస్తాయి. పచ్చిరొట్ట సాగుతో 30 శాతం రసాయన ఎరువుల వినియోగం తగ్గుతుంది. రైతులు ఆర్థికంగా లాభపడడానికి పచ్చిరొట్ట పైర్లు దోహదం చేస్తాయి. పచ్చిరొట్ట ఎరువును పండించడానికి అవకాశం లేనప్పుడు పచ్చిరొట్ట ఆకులు, లేత కొమ్మలు బయటి నుంచి తెచ్చి పొలంలో వేసి కలియదున్నాలి. తగినంత నీరు పెట్టి కుళ్లనివ్వాలి. ఉదాహరణకు నేల తంగెడి, సుబాబుల్, గానుగ.ఎరువుల ధరలు ఆకాశాన్నంటుతున్న ప్రస్తుత తరుణంలో వీటి సాగుతో పెట్టుబడి వ్యయం తగ్గుతుంది.

సీపెట్ డిప్లొమో కోర్సులకు దరఖాస్తు చేసుకోండి

కర్నూలు(సెంట్రల్): భారత ప్రభుత్వ సంస్థ అయిన సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (సీపెట్) కోర్సుల్లో ప్రవేశాలకు మే 29వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ఆ సంస్థ డైరెక్టర్ అండ్ హెడ్ సీహెచ్ శేఖర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పదో తరగతి అర్హతతో 3 సంవత్సరాల వ్యవధి కలిగిన డిప్లొమా ఇన్ ప్లాస్టిక్ టెక్నాలజీ (డీపీటీ), డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ మౌల్డ్ టెక్నాలజీ(డీపీఎంటీ), బీఎస్సీ విద్యార్హతతో 2 సంవత్సరాల వ్యవధి కలిగిన పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ ప్రాసెసింగ్ అండ్ టెస్టింగ్ (పీజీడీ-పీపీటీ) అనే కోర్సులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆయా కోర్సుల్లో సీట్లు పొందిన విద్యార్థులకు ఏపీ ప్రభుత్వం ఫీజురీయింబర్స్‌మెంట్ అందిస్తుందని చెప్పారు. ఎంపికైన విద్యార్థులు విజయవాడలో తరగతులకు హాజరు కావాల్సి ఉంటుందన్నారు. కాగా, సీపెట్ అడ్మిషన్ టెస్ట్ ఆధారంగా సీట్లను భర్తీ చేస్తారని వివరించారు. cipet25.onlineregistrationform.org/cipet వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉందని, వివరాలకు 83093 98357 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.



జంక్షన్.. టెన్షన్

కొలిమిగుండ్ల:స్థానిక జమ్మలమడుగు రోడ్డులోని జంక్షన్ వాహనదారులకు దడ పుట్టిస్తోంది. మూడు రోడ్ల కూడలిలో మలుపులు ఉండడంతో అక్కడికి చేరుకునే సరికి వాహనదారులు భయంగా వాహనాలు డ్రైవ్ చేయాల్సిన పరిస్థితి నెలకొంది. మలుపులు తిరిగే సమయంలో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అనంతపురం-అమరావతి, నెల్లూరు-ముంబై ప్రధాన రహదారులు జంక్షన్‌లో కలుస్తాయి. రెండు మార్గాల నుంచి నిత్యం వందలాది వాహనాలు రవాణ సాగిస్తుంటాయి. జంక్షన్ మధ్యలో 2009లో అంబేద్కర్ విగ్రహ ఏర్పాటు కోసం భూమి పూజ చేశారు. అప్పటి నుంచి నేటి వరకు నిర్మాణ పనులు పూర్తికాక అసంపూర్తిగా నిలిచిపోయాయి. దీంతో అక్కడ వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మలుపు వద్ద నిర్మాణాలు ఉన్న కారణంగా కనిపించక అవస్థలు పడుతున్నారు. జంక్షన్‌లో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించేలా సంబంధిత అధికారులు విస్తరణ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఖరీఫ్‌కు సన్నద్ధం



జొన్నకొయ్యలను తొలగిస్తున్న వ్యవసాయ కూలీలు



ట్రాక్టర్‌తో పొలం దున్నుతున్న రైతన్న



ఎద్లతో సేద్యం పనులు చేస్తున్న అన్నదాత

బేతంచెర్ల: ఖరీఫ్ సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. గత ఏడాది వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండినా గిట్టుబాటు ధర లభించక తీవ్రంగా నష్ట పోయారు. మరోసారి తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు. మండలంలో సుమారు 14,800 హెక్టార్లలో సాగుభూమి ఉంది. ఖరీఫ్‌లో 13,500 హెక్టార్లలో పంటలు సాగు చేపట్టేందుకు దుక్కులు చేసుకుంటున్నారు. మండలంలో 70 శాతం వరకు రైతులు వర్షాలపై ఆధారపడి వ్యవసాయం చేస్తున్నారు. ఖరీఫ్‌లో ముఖ్యంగా కందులు, జొన్నలు, కొర్ర, పత్తి, మినుము, వేరుశనగ పంటలు వేస్తారు. ఈ దఫా అయినా తమకు లాభాలు వస్తాయనే ఆశతో పంటల సాగుకు సమాయత్తమవుతున్నారు. గత సీజన్‌లో సాగు చేసి పొలాల్లో మిగిలిపోయిన జొన్న, కంది కొయ్యలను తొలగిస్తున్నారు. మండలంలో 70 శాతం ఎర్రమట్టి నేలలు, ఇసుక నేలలు, 30 శాతం నల్లరేగడి నేలలు ఉన్నాయి. ఎర్రమట్టి నేలల్లో కంది, వేరుశనగ, కొర్ర, సజ్జ పంటలను సాగుచేస్తారు. రైతులు ఖరీఫ్‌ను దృష్టిలో ఉంచుకుని దుక్కులు చేసుకోవాలని, భూమిలోని పురుగులు బయటకు వచ్చి ఎండవేడిమికి చనిపోతాయని మండల వ్యవసాయధికారి కిరణ్ కుమార్ తెలిపారు. దీంతో కొంతమేర పురుగు ఉధ్రుతిని తగ్గించవచ్చన్నారు.